## క్లుప్తంగా

### అభివృద్ధి పనులకు శంకుస్థాపన



పాత కరాసాలో శంకుస్థాపన చేస్తున్న జియ్యాని శ్రీధర్

**గోపాలపట్నం:** జీవీఎంసీ 52వ వార్డు కరాసాలో పలు అభివృద్ధి పనులకు బుధవారం మాజీ డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ శంకుస్థాపనలు చేశారు. కొత్త కరాసా రజక వీధిలో సామాజిక భవనం అదనపు అంతస్తు నిర్మాణానికి, పాత కరాసాలో జీవీఎంసీ ప్రైమరీ పాఠశాల అదనపు అంతస్తు, వుడా లేఅవుట్‌లో సామాజిక భవనం నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసి ఆయన మాట్లాడారు. ప్రజల అవసరాల నిమిత్తం వార్డులో పలు అభివృద్ధి పనులు చేపడుతున్నామన్నారు. మొత్తంగా వార్డులో 7 పనులకు గాను రూ.95.15 లక్షలు వెచ్చిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో వార్డు అధ్యక్షుడు జియ్యాని మారుతి, వెదుళ్ల శ్రీనివాసరావు, స్థానికులు పాల్గొన్నారు.

### నిల్వ నీటిలో ఆయిల్ బంతులు




నీరు నిల్వ ఉన్న ప్రదేశంలో ఆయిల్ బంతులు వేస్తున్న మలేరియా సిబ్బంది

**గోపాలపట్నం:** జీవీఎంసీ 89వ వార్డు కొత్తపాలెం నుంచి నరవ వెళ్లే రోడ్డులోని ఖాళీ స్థలాల్లో వర్షాలకు నీరు నిల్వ ఉండిపోతోంది. దీనిలో దోమల లార్వా పెరుగుతున్న సమస్యపై 'ముసురుతోంది' అనే శీర్షికన 'సాక్షి'లో కథనం ప్రచురితమైంది. దీనికి స్పందించిన మలేరియా అధికారులు బుధవారం నిల్వ నీటిలో ఆయిల్ బంతులు వేశారు. ఈ విషయంలో ఎన్నటికప్పుడు పర్యవేక్షిస్తామని అధికారులు తెలిపారు. సమస్య పరిష్కారం కావడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

### మహనీయుల త్యాగఫలం విశాఖ ఉక్కు



కార్యక్రమంలో పాల్గొన్న కార్పొరేటర్ పి.వి.సురేష్, అనిల్

**మల్కాపురం:** 'విశాఖ ఉక్కు–ఆంధ్రుల హక్కు' నినాదంతో, ఎంతోమంది మహనీయుల త్యాగఫలంతో స్టీల్‌ప్లాంట్ నిర్మాణం జరిగిందని 60వ వార్డు కార్పొరేటర్ పి.వి.సురేష్, వైఎస్సార్ ట్రేడ్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు అనిల్‌కుమార్ అన్నారు. స్టీల్‌ప్లాంట్ సాధించి నేటికి 60 వసంతాలు పూర్తయిన సందర్భంగా వై.మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్లాంట్ వద్ద గల అమృతరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ప్లాంట్ అఖిలపక్ష కార్మిక సంఘాల నాయకులు పాల్గొన్నారు.

### 18 నుంచి గౌరమ్మ సంబరాలు



పోస్టర్ ఆవిష్కరిస్తున్న గౌరీ సంఘం సభ్యులు

**గోపాలపట్నం:** బుచ్చిరాజుపాలెం గౌరీపరమేశ్వరుల పండగ మహోత్సవ పోస్టర్‌ను బుధవారం గవర వీధి రామాలయం గౌరీ సేవా సంఘం సభ్యులు ఆవిష్కరించారు. ఈ నెల 18 నుంచి నవంబర్ 22 వరకు గౌరమ్మ సంబరాలు కొనసాగుతాయని నిర్వాహకులు తెలిపారు. 22న అనుపు మహోత్సవం, మధ్యాహ్నం భారీ అన్నసమారాధన, వినోద కార్యక్రమాలు జరుగుతాయన్నారు.

### రైల్వేస్టేషన్‌లో 5 కిలోల గంజాయి స్వాధీనం

**తాటిచెట్లపాలెం:** విశాఖ రైల్వే స్టేషన్‌లో బుధవారం నిర్వహించిన తనిఖీల్లో 5 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని, రవాణాదారుడిని అదుపులోకి తీసుకున్నారు. గవర్నమెంట్ రైల్వే పోలీసులు తెలిపిన వివరాలిలా.. జీఆర్పీ ఇన్‌స్పెక్టర్ సిహెచ్.ధనుంజయనాయుడు ఆధ్వర్యంలో ఆర్పీఎఫ్, జీఆర్పీ, సీబీబీ సంయుక్తంగా తమ సిబ్బందితో కలిసి రైల్వే స్టేషన్‌లోని పలు ప్లాట్‌ఫారాల్లో తనిఖీలు నిర్వహించారు. ఒడిశా కోరాపుట్ జిల్లాకు చెందిన దేవేందర్ భోస్లా కోరాపుట్ నుంచి విశాఖకు అక్రమంగా గంజాయిని తీసుకురావడాన్ని గుర్తించి అరెస్ట్ చేశారు. రూ.25 వేల విలువైన 5 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకుని, నిందితుడిని రిమాండ్ నిమిత్తం కోర్టులో హాజరు పరిచారు.

# చిత్రకళా బోధనకు చోటేది..?



మల్కాపురం జీవీఎంసీ హైస్కూల్‌లో బోర్డుపై డ్రాయింగ్స్ నేర్పిస్తున్న ఉపాధ్యాయుడు మనోహర్(ఫైల్)

- జీవీఎంసీ పాఠశాలల్లో భర్తీకాని డ్రాయింగ్ టీచర్ల పోస్టులు
- పెయింటింగ్స్ నేర్పించే వారు లేక విద్యార్థుల్లో నిరాశ
- మూడేళ్లుగా ఆర్ట్ టీచర్ల ఎదురుచూపులు

**మల్కాపురం:** పారిశ్రామిక ప్రాంతంలోని పలు జీవీఎంసీ ఉన్నత పాఠశాలల్లో డ్రాయింగ్ టీచర్లను నేటికీ నియమించ లేదు. ఇటీవల ప్రభుత్వం విడుదల చేసిన మెగా డీఎస్సీలో డ్రాయింగ్ టీచర్ల పోస్టులకు మోక్షం కలుగుతుందని పలువురు డ్రాయింగ్ ఉపాధ్యాయులు ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. ప్రభుత్వం మొండిచెయ్యి చూపడంతో వారు నిరాశ చెందారు. డ్రాయింగ్‌పై ఆసక్తి ఉన్న విద్యార్థులు తమ పాఠశాలల్లో ఆర్ట్‌ను బోధించే వారు లేకపోవడంతో అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు.

**మూడేళ్లుగా నియామకాలు శూన్యం**

పారిశ్రామిక ప్రాంతంలోని శ్రీహరిపురం, మల్కాపురం, గాంధీగ్రామ్ వంటి ప్రాంతాల్లోని జీవీఎంసీ ఉన్నత పాఠశాలల్లో ఆరు నుంచి పదో తరగతి వరకు చదువుతున్న విద్యార్థులు వందల సంఖ్యలో ఉన్నారు. ఆయా పాఠశాలల్లో మూడేళ్లుగా డ్రాయింగ్ టీచర్లు లేరు. విద్యార్థుల మేధోశక్తికి పదును పెట్టేందుకు, చిత్రకళపై ఆసక్తిని మరింత పెంపొందించి, వారిని దేశ గర్వపడే మంచి చిత్రకారులుగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వ పాఠశాలల్లో డ్రాయింగ్ టీచర్లను సర్కారు నియమించేది. వివిధ సబ్జెక్ట్‌లు నేర్చుకుంటూ ఒత్తిడితో ఉండే విద్యార్థులకు డ్రాయింగ్ క్లాసులు కాస్త ఉపశమనం అందిస్తాయి. వారి మెదడుకు మంచి ఆలోచన కలిగించే విధంగా చిత్రకళ బోధన ఉండేది. అలాంటి చిత్రకళను బోధించే ఉపాధ్యయుల నియామకం జరగడం లేదు. వీరిని నియమించాలన్న ఆలోచన ప్రభుత్వానికి లేకపోవడంతో ఈ పోస్టులపై ఆశలు పెట్టుకున్న ఉపాధ్యాయులు, చిత్రకళ నేర్చుకోవాలనుకునే విద్యార్థులు నిరాశ చెందుతున్నారు. ఈ సమస్యపై పలువురు డ్రాయింగ్ టీచర్లు రాష్ట్ర విద్యా శాఖ మంత్రి లోకేశ్‌కు వినతిపత్రం అందజేశారు. జీవీఎంసీ పాఠశాలల్లో డ్రాయింగ్ టీచర్ల పోస్టుల నియామకానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

**నమ్ముకుని పనిచేశా.. ఫలితం లేదు**



మల్కాపురం జీవీఎంసీ ఉన్నత పాఠశాలలో డ్రాయింగ్ టీచర్‌గా కాంట్రాక్ట్ పద్ధతిలో కొంత కాలం పనిచేశాను. నన్ను రెగ్యూలర్ చేస్తారని ఆశతో చాలా రోజులు ఎదురు చూశాను. ఫలితం లేదు. జీతం సరిపోక డ్రాయింగ్ టీచర్ పని మానేయాల్సి వచ్చింది. ఈ సమస్యపై రాష్ట్ర విద్యా శాఖ మంత్రికి వినతి పత్రం అందించాం.

– శ్రీనివాస్ మనోహర్, డ్రాయింగ్ టీచర్

**ఎంతో ఆశతో ఎదురు చూశాం**



ఇటీవల విడుదలైన మెగా డీఎస్సీలో డ్రాయింగ్ పోస్టులను తీస్తారని ఎంతో ఆశతో ఎదురు చూశాం. ఫలితం లేదు. ఈ వృత్తినే నమ్ముకుని ఉన్న నాలాంటి వారి పరిస్థితి ఏంటీ?. మాలాంటి ఆర్ట్ ఉపాధ్యాయులకు న్యాయం జరిగేలా ప్రభుత్వం చూడాలి.

– వియ్యపు శివసత్యనారాయణ, ఆర్ట్ టీచర్, గాజువాక



గీసిన చిత్రాలు చూపుతున్న విద్యార్థులు(ఫైల్)

# బలవంతపు భూ సేకరణ ఆపాలి



సమావేశంలో పాల్గొన్న ఆంధ్ర ఐక్య ఉద్యమాల నాయకులు

**ఆంధ్ర ఉద్యమాల ఐక్యవేదిక నేతల డిమాండ్**

**సీతంపేట:** ప్రభుత్వం బలవంతపు భూసేకరణ ఆపాలని 'ఆంధ్ర ఉద్యమాల ఐక్యవేదిక' నేతలు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం నగరంలోని పౌర గ్రంథాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఐక్యవేదిక నేతలు మాట్లాడారు. రాష్ట్రంలోని అన్ని ఉద్యమాల సమాహారమే ఆంధ్ర ఉద్యమాల ఐక్య వేదిక అని తెలిపారు. రాష్ట్రంలో జరుగుతున్న భూ దోపిడీకి వ్యతిరేకంగా అన్ని ఉద్యమాల్ని ఏకతాటిపై తెచ్చి బలోపేతం చేయడమే దీని ముఖ్య ఉద్దేశమన్నారు. అందులో భాగంగా ఏడాది కాలంగా కూటమి ప్రభుత్వం చేపడుతున్న బలవంతపు భూ సేకరణ, విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ, అంబుజా సిమెంట్ ఏర్పాటుకు వ్యతిరేకంగా ఉద్దానం నుంచి తడ వరకు ఉద్యమం చేపట్టినట్టు తెలిపారు. కూటమి ప్రభుత్వ భూ దోపిడీకి ఉత్తరాంధ్ర బలైపోయిందన్నారు. ఉద్దానంలో కార్గో ఎయిర్ పోర్టుకు 3 వేల ఎకరాలు, విజయనగరం జిల్లా ఎస్.కోట ప్రాంతంలో జిందాల్ ఎంఎస్‌ఎంఈ పార్క్ పేరుతో సుమారు 1500 ఎకరాలు, వెన్నలవలసలో ప్రాణాంతక థర్మల్ పవర్ ప్లాంట్‌కు 2 వేల ఎకరాలు, నక్కపల్లిలో మిట్టల్ స్టీల్ ప్లాంట్, బల్క్ డ్రగ్ పార్కులకు 5 వేల ఎకరాలు సేకరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇక టీసీఎస్, ఉర్సా క్లస్టర్లకు కేవలం ఎకరం 99 పైసలకే ఇవ్వడం దేశంలో మరే రాష్ట్రంలోనూ జరగలేదని ఆక్షేపించారు. ఈ సంస్థలకు అప్పనంగా రాయితీలు, భూములిస్తూ విశాఖ స్టీల్ ప్లాంటుకు రూ.33 వేల కోట్ల సహాయం అందించడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ముందుకు రాకపోవడం శోచనీయమన్నారు. కార్పొరేట్ సంస్థలకు రూ.16 లక్షల కోట్లను మాఫీ చేసిన కేంద్రం విశాఖ ఉక్కుకు రూ.33 వేల కోట్లను మాఫీ చేయడానికి మాత్రం ముందుకు రావడంలేదన్నారు. ప్రస్తుతం అధిక కాలుష్యాన్ని వెదజల్లే అంబుజా అదానీ సిమెంట్ కంపెనీకి అన్ని పర్మిషన్లు ఇవ్వాలని చూస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రాజెక్టును అమలుకు ముందుగా స్థానిక ప్రజలతో చర్చించాల్సిందేనన్నారు. మేధావులతో సమావేశాలు ఏర్పాటు చేయాలని, కష్టనష్టాల్ని బేరీజు వేయాలన్నారు. సమావేశంలో ఆంధ్ర ఉద్యమాల ఐక్యవేదిక కన్వీనర్ వీఎస్ మహదేవ్, ఉత్తరాంధ్ర ప్రజా సంస్థ కన్వీనర్ వీవీ రమణమూర్తి, అంబుజా సిమెంట్ ఫ్యాక్టరీ వ్యతిరేక పోరాట కమిటీ ప్రతినిధి, న్యాయవాది పల్లా కార్తీక్, పీవోడబ్ల్యూ రాష్ట్ర అధ్యక్షురాలు ఎం.లక్ష్మి, ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.వెంకటేశ్వర్లు, ఏఐటీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు సీహెచ్ ప్రమీల, ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ పీపుల్స్ లాయర్స్ ప్రతినిధి, న్యాయవాది కేఎస్ చలం, స్టీల్ ప్లాంట్ యూజ్ నాయకుడు కె.పరంధామయ్య తదితరులు పాల్గొన్నారు.

# వైద్య కళాశాలల ప్రైవేటీకరణ దారుణం



59వ వార్డులో మాట్లాడుతున్న రేవళ్ల సత్యనారాయణ

**మల్కాపురం:** ప్రభుత్వ వైద్య కళాశాలలను ప్రైవేట్ పరం చేయాలని కూటమి సర్కార్ యోచన చేయడం చాలా దారుణమని వైఎస్సార్‌సీపీ 59వ వార్డు అధ్యక్షుడు రేవళ్ల సత్యనారాయణ ఆవేదన వ్యక్తం చేశారు. మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ పశ్చిమ సమన్వయకర్త మళ్ల విజయప్రసాద్ ఆదేశాల మేరకు వార్డులోని నెహ్రూనగర్‌లో బుధవారం మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కోటి సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. ముందుగా స్థానిక కార్యకర్తలు, పలు అనుబంధాల సంస్థల ప్రతినిధులు, ముఖ్య నాయకులతో సత్యనారాయణ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు కోటి సంతకాల ప్రజా ఉద్యమం కార్యక్రమాన్ని ప్రతిష్ఠాతంగా తీసుకోవాలని, ప్రతి కార్యకర్త స్వచ్ఛందంగా ఇంటింటికీ వెళ్లి కూటమి ప్రభుత్వ పాలన తీరుపై వివరించాల్సి ఉందన్నారు. ప్రజల అనుమతులతో సర్కార్‌కు వ్యతిరేకంగా సంతకాలు సేకరించాలని సూచించారు. ప్రజలకు మేలు చేయాలనే మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంకల్పానికి పార్టీ శ్రేణులంతా అండగా నిలుద్దామని పిలుపునిచ్చారు. అనంతరం ఆ ప్రాంతంలో కార్యకర్తలతో కలిసి ఇంటింటికీ వెళ్లి సంతకాలు సేకరించారు. కార్యక్రమంలో పార్టీ ప్రచార కార్యదర్శి ఎడ్ల సత్యనారాయణ, కుమార్, ఎదుర సత్యనారాయణ, ఖాన్, అర్జున్, మడక అప్పారావు, మైలపల్లి కృష్ణ, డేవిడ్, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.



40వ వార్డులో సంతకాలు సేకరిస్తున్న కార్పొరేటర్ నాగేశ్వరరావు

- 58వ వార్డు గుల్లలపాలెంలో కార్పొరేటర్ గులిగిందల లావణ్య పార్టీ నాయకులతో కలిసి ప్రజల సంతకాలు సేకరించారు.

**మెడికల్ కాలేజీలను రక్షించుకుందాం**

**సింథియా:** మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వైఎస్సార్‌సీపీ నిర్వహిస్తున్న కోటి సంతకాల ప్రజా ఉద్యమంలో భాగంగా బుధవారం 40వ వార్డు ఏకేసీ కాలనీలో కార్పొరేటర్ గుండపు నాగేశ్వరరావు ఇంటింటా సంతకాలు సేకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కేంద్ర ప్రభుత్వంతో పోరాడి ఒకేసారి 17 మెడికల్ కాలేజీల ఏర్పాటుకు అన్ని అనుమతులు తీసుకురావడం చరిత్రాత్మక విషయమన్నారు. అటువంటి వైద్య కళాశాలలన్నింటినీ ప్రైవేటీకరించాలని కూటమి ప్రభుత్వం తీసుకున్న అనాలోచిత నిర్ణయాన్ని వ్యతిరేకించారు. మెడికల్ కాలేజీలను ప్రైవేటీకరిస్తే భవిష్యత్తులో యువత ఎదుర్కొనే ఇబ్బందులను వివరించారు. ప్రభుత్వ మెడికల్ కాలేజీల వల్ల ఎంతోమంది పేద, మధ్యతరగతి ప్రజలకు విద్య, వైద్యం అందుబాటులోకి వస్తుందని, కూటమి ప్రభుత్వం ప్రైవేటీకరణ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు పాల్గొన్నారు.

### విద్యార్థులు నైపుణ్యాలు పెంచుకోవాలి



ఎగ్జిబిషన్‌లో నమూనాలను తిలకిస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులు

**మల్కాపురం:** విద్యార్థులు నిరంతరం తమ నైపుణ్యాలను పెంచుకోవాలని, సృజనాత్మకతను ప్రదర్శించాలని ఇంటర్మీడియట్ ప్రాంతీయ పర్యవేక్షణ అధికారి పి.మురళీధర్ అన్నారు. మాజీ రాష్ట్రపతి దివంగత డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం జయంతి సందర్భంగా బుధవారం మల్కాపురం సెయింట్ ఆన్స్ మహిళా కళాశాలలో ఎగ్జిబిషన్ ఏర్పాటు చేశారు. కార్యక్రమాన్ని ప్రారంభించిన ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థి చదువుపై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. అతి తక్కువ సమయంలోని ఎగ్జిబిషన్‌లో 50 స్టాళ్లు ఏర్పాటు చేయడం ప్రశంసనీయమన్నారు. విద్యార్థినుల సామాజిక స్పృహకు, శాస్త్రీయ దృక్పథానికి ప్రతికూలంగా స్టాళ్లు ఏర్పాటు చేశారు. వీటిని కళాశాల అధ్యాపకులు, విద్యార్థుల తల్లిదండ్రులు ఆసక్తిగా తిలకించారు.

# 'ఆరోగ్యశ్రీ' సేవలకు ఆరో రోజూ బ్రేక్

**పేద రోగుల కష్టాలు రెట్టింపు**

**మహారాణిపేట:** జిల్లాలో ఎన్టీఆర్ వైద్య సేవ పథకం కింద వైద్య సేవలు నిలిచిపోయి ఆరు రోజులైంది. ఈ పరిస్థితి వల్ల పేద రోగుల ఇబ్బందులు రోజురోజుకూ పెరుగుతున్నాయి. నెట్‌వర్క్ ఆస్పత్రులకు చికిత్స కోసం వెళ్లిన రోగులు చేదు అనుభవంతో వెనుదిరుగుతున్నారు. ఆస్పత్రులలో అడ్మిషన్లు లభించక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ నెల 10 నుంచి జిల్లాలోని అన్ని నెట్‌వర్క్ ఆస్పత్రులు వైద్య సేవలను నిలిపివేసిన సంగతి తెలిసిందే. ఎన్టీఆర్ ఆరోగ్య శ్రీ ట్రస్ట్ నుంచి రావాల్సిన బకాయిలను ప్రభుత్వం చెల్లించకపోవడంతో ఆస్పత్రులు ఈ నిర్ణయం తీసుకున్నాయి. కాగా.. జిల్లాలో ఆరోగ్య శ్రీ నెట్‌వర్క్ పరిధిలో మొత్తం 63 ఆస్పత్రులు ఉన్నాయి. సమ్మెలో ఉన్న ఆస్పత్రుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతుండడం ఆందోళన కలిగిస్తోంది. గతంలో 27 నెట్‌వర్క్ ఆస్పత్రులు సమ్మెలో ఉండగా, ఇప్పుడు ఆ సంఖ్య 33కు చేరింది. బకాయిలన్నీ వెంటనే చెల్లించాలని ఆస్పత్రుల యాజమాన్యాలు డిమాండ్ చేస్తున్నాయి. ప్రభుత్వ ఉద్యోగులు, రిటైర్డ్ ఉద్యోగుల కోసం ఉద్దేశించిన ఎంప్లాయీస్ హెల్త్ స్కీమ్, వర్కింగ్ జర్నలిస్టులకు అందించే వైద్య సేవలు కూడా నామమాత్రంగానే అందుతున్నాయి.

### గుండెపోటు చికిత్సకు అందుబాటులో అత్యవసర ఇంజెక్షన్లు



మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ గణబాబు

**గోపాలపట్నం:** గుండెపోటు వచ్చిన వారిని రక్షించే విధంగా అత్యవసర చికిత్సలో ఉపయోగించే టెనెక్టెప్లేస్ ఇంజెక్షన్లు ప్రభుత్వ ఆస్పత్రిలో అందుబాటులో ఉన్నాయని ప్రభుత్వ విప్ గణబాబు తెలిపారు. గోపాలపట్నం కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో బుధవారం అధికారులు, డెవలప్‌మెంట్ సొసైటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ సుజాత హెల్త్ సెంటర్‌లో అందుబాటులో ఉన్న సౌకర్యాలు, పేషెంట్ల సంఖ్య వంటి వివరాలు తెలియజేశారు. ప్రతి రోజూ 250 నుంచి 300 మంది పేషెంట్లు వస్తున్నారని, 30 నుంచి 35 వరకు ప్రసవాలు జరుగుతున్నాయని వివరించారు. ఐఈడీఈ డిపార్ట్‌మెంట్ రోగులకు తాగునీరు అందించే ఆర్వో ప్లాంట్ ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు. గోపాలపట్నం నుంచి ఎన్ఏడీ జంక్షన్ వరకు ప్రమాదాలు ఎక్కువగా జరిగే ప్రాంతం కావడంతో అంబులెన్సుల సంఖ్య పెంచాలని కోరారు. అంబులెన్సుల సిబ్బంది ఉండేందుకు సౌకర్యం కల్పించాలన్నారు. గోపాలపట్నం ఆస్పత్రి నుంచి క్రిటికల్ పేషెంట్లను పెద్ద ఆస్పత్రులకు తరలించేందుకు తీవ్ర జాప్యం జరుగుతోందని తెలిపారు. దీనిపై స్పందించిన గణబాబు మాట్లాడుతూ ఈ సమస్యలు త్వరలోనే పరిష్కరించేందుకు కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో డీసీహెచ్ డాక్టర్ శంకర ప్రసాద్, జోనల్ కమిషనర్ శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

# కార్మికుడి కుటుంబానికి ఆర్థిక సాయం



మృతుడు పైడితల్లి కుటుంబానికి రూ.50 వేలు అందజేస్తున్న కార్మికులు

**సింథియా:** ధనరెడ్డి అండ్ గంగిరెడ్డి షిప్పింగ్స్ గొడౌన్స్‌లో పనిచేస్తూ ఇటీవల అనారోగ్య సమస్యలతో మృతి చెందిన కార్మికుడు మండల పైడితల్లి కుటుంబ సభ్యులకు బుధవారం ధనరెడ్డి అండ్ గంగిరెడ్డి షిప్పింగ్స్ గొడౌన్స్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) కార్మికులందరూ కలిపి రూ.50 వేల ఆర్థిక సాయం అందజేశారు. గొడౌన్స్ సీఐటీయూ యూనియన్ అధ్యక్షుడు పైడిరాజు, కార్యదర్శి సత్యనారాయణ, వర్కింగ్ ప్రెసిడెంట్ లక్ష్మణమూర్తి, జాయింట్ సెక్రటరీ అల్లు వెంకటరమణ, దేవుడు బాబు, జి.నాయుడు, మేస్త్రీలు శ్రీనివాసరావు, సోమునాయుడు, కృష్ణ కమిటీ సభ్యులు చేతుల మీదుగా మృతుడి కుమారుడు వెంకటేష్‌కు నగదు అందించారు. ఈ సందర్భంగా యూనియన్ సభ్యులు మాట్లాడుతూ 40 ఏళ్లుగా ధనరెడ్డి అండ్ గంగిరెడ్డి షిప్పింగ్స్ గొడౌన్స్ కార్మికులు ఎటువంటి ప్రమాదాల బారిన పడినా, అనారోగ్యాలతో మరణించిన వారి కుటుంబాలకు 624 మంది కార్మికులు కలిపి ఆదుకోవడం గొప్ప విషయమన్నారు.

### 91వ వార్డులో జెడ్సీ పర్యటన



లక్ష్మీనగర్‌లో పర్యటిస్తున్న జోనల్ కమిషనర్ శంకరరావు

**గోపాలపట్నం:** జీవీఎంసీ 91వ వార్డు లక్ష్మీనగర్ ఈ బ్లాక్ ప్రాంతంలో బుధవారం జోనల్ కమిషనర్ శంకరరావు పర్యటించారు. స్థానికులు ఇచ్చిన ఫిర్యాదుల మేరకు ఇక్కడి పరిస్థితిని క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. లక్ష్మీనగర్‌కు చెందిన ఆదినారాయణ అక్కడి రహదారులు, కాలువల పరిస్థితిని వివరించారు. దీనిపై స్పందించిన జెడ్సీ జనరల్ ఫండ్స్ ద్వారా వాటికి మరమ్మతులు చేయిస్తానని, ఇంజినీరింగ్ అధికారులను పంపించి ఈ పనులకు అంచనాలు వేయిస్తామని హామీ ఇచ్చారు.

# ఆదర్శనీయుడు అబ్దుల్ కలాం




ఎన్ఎస్‌టీఎల్ గేటు వద్ద అబ్దుల్ కలాం విగ్రహానికి నివాళులర్పిస్తున్న డైరెక్టర్ అబ్రహం వర్గీస్, శాస్త్రవేత్తలు

**గోపాలపట్నం:** మాజీ రాష్ట్రపతి, భారతరత్న డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం జయంతి సందర్భంగా బుధవారం ఘనంగా నివాళులర్పించారు. ఎన్ఎస్‌టీఎల్ జాతీయ రహదారి గేటు వద్ద కలాం విగ్రహానికి ఎన్ఎస్‌టీఎల్ డైరెక్టర్ అబ్రహం వర్గీస్ పూలమాలతో నివాళి అర్పించి మాట్లాడారు. నేటి యువతరానికి, విద్యార్థులకు అబ్దుల్ కలాం ఆదర్శనీయుడన్నారు. కార్యక్రమంలో పలువురు శాస్త్రవేత్తలు, యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

- శ్రీదేవి విజ్ఞాన జ్యోతి సంస్థ ఆధ్వర్యంలో ఆర్ఆర్ వెంకటాపురం ఎస్సీబీసీ కాలనీ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో అబ్దుల్ కలాం చిత్రపటానికి సంస్థ వ్యవస్థాపకురాలు కీర్తి పట్నాయక్, హెచ్ఎం కామరాజు పూల మాలలు వేసి నివాళులర్పించారు. పిల్లలకు మిఠాయిలు పంచారు.
- గోపాలపట్నం శాఖా గ్రంథాలయంలో అబ్దుల్ కలాం చిత్రపటానికి గ్రంథాలయాధికారి ఎస్.వి.నరసింహం పూలమాల వేసి నివాళి అర్పించారు. విద్యార్థులు కలలు కని సాకారం కోసం కష్టపడాలని కలాం చెప్పిన మాటలు నేటి యువత ఆకళింపుచేసుకోవాలన్నారు. పాఠకులు, సిబ్బంది పాల్గొన్నారు.



గోపాలపట్నం గ్రంథాలయంలో కలాం చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నరసింహం తదితరులు



ఎస్సీబీసీ కాలనీలో అబ్దుల్ కలాం చిత్రపటానికి పూలమాల వేస్తున్న సంస్థ సభ్యులు

# తల్లిదండ్రుల చెంతకు తప్పిపోయిన బాలుడు

**గోపాలపట్నం:** పశ్చిమ బెంగాల్ మాల్దా నుంచి బెంగళూరు వెళ్తున్న కుటుంబంలో మతిస్థిమితం లేని బాలుడు విశాఖపట్నంలో దిగిపోయాడు. అతడిని తిరిగి తల్లిదండ్రుల చెంతకు గోపాలపట్నం పోలీసులు చేర్చారు. పోలీసులు తెలిపిన వివరాలిలా.. మాల్దా నుంచి రైలులో బెంగుళూరు వెళ్తున్న ఓ కుటుంబంలోని మతిస్థిమితం లేని బాలుడు రాత్రి నిద్రించేందుకు మాత్రలు వేసుకోవలసి ఉంది. మంగళవారం రాత్రి మాత్ర వేయక పోవడంతో విశాఖ రైల్వే స్టేషన్‌లో దిగిపోయాడు. అక్కడి నుంచి గోపాలపట్నంలోని సింహాచలం రైల్వే స్టేషన్‌కు చేరుకున్నాడు. అక్కడ నైట్ బీట్‌లో ఉన్న పోలీసులు గుర్తించి వివరాలు అడిగినా తెలపక పోవడంతో స్టేషన్‌కు తీసుకెళ్లారు. బాలుడి టీషర్టుపై ఉన్న ఫోన్ నంబర్లకు ఫోన్ చేయగా వివరాలు తెలిశాయి. అప్పటికే తల్లిదండ్రులు చాలా దూరం వెళ్లిపోయారు. వీరు తిరిగి విశాఖ చేరుకుని గోపాలపట్నం పోలీస్ స్టేషన్‌కు వచ్చారు. తల్లిదండ్రులకు సీఐ సన్యాసినాయుడు సిబ్బంది బాలుడిని అప్పగించారు.

# ఆటో డ్రైవర్ల సహకారంతో దొంగతనాల కట్టడి



ఆటో డ్రైవర్లకు అవగాహన కల్పిస్తున్న వెస్ట్ క్రైం సీఐ చంద్రమౌళి, ఎస్ఐ మారూఫ్

**మర్రిపాలెం:** ఇటీవల దొంగతనాలు ఎక్కువగా జరుగుతున్నాయని, వాటిపై అందరూ అవగాహన కలిగి అప్రమత్తంగా ఉండాలని వెస్ట్ క్రైం సీఐ చంద్రమౌళి సూచించారు. కప్పరాడ జంక్షన్‌లో బుధవారం ఆటో డ్రైవర్లకు ఆయన పలు దొంగతనాలపై అవగాహన కల్పించారు. దొంగతనాలు చేసేవారు ఆటోల్లోనే తిరుగుతూ చోరీలకు పాల్పడుతున్నారని, అలాంటి అనుమానితులను గుర్తిస్తే వెంటనే పోలీసులకు సమాచారమందించాలని కోరారు. ఆటో డ్రైవర్లంతా కలిసి ఒకే చోట ఆటోలు నిలపాలని, ఆయా ప్రాంతాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఆటో డ్రైవర్లు యూనియన్‌గా ఏర్పడి ఇలాంటి ఘటనలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పోలీసులకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో క్రైం ఎస్ఐ మారూఫ్, సిబ్బంది పాల్గొన్నారు.

### దుకాణాలపై దాడులు.. ప్లాస్టిక్ కవర్ల స్వాధీనం



దుకాణంలో తనిఖీ చేస్తున్న శానిటరీ ఇన్‌స్పెక్టర్ రవికుమార్, సిబ్బంది

**మల్కాపురం:** నిషేధిత ప్లాస్టిక్ కవర్లు విక్రయిస్తున్న పలు దుకాణదారులకు అధికారులు జరిమానాలు విధించారు. 120 మైక్రోన్ల కన్న తక్కువ మందం గల ప్లాస్టిక్ వినియోగం వల్ల అనేక అనార్థాలు ఎదురవుతాయని అధికారులు పలు మార్లు దుకాణాల యజమానులకు అవగాహన కల్పిస్తున్నా.. వారు లెక్కచేయడం లేదు. ఈ నేపథ్యంలో బుధవారం 58వ వార్డు శ్రీహరిపురంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ డి.రవికుమార్ పలు దుకాణాలపై దాడులు చేశారు. ప్లాస్టిక్ కవర్లు విక్రయిస్తున్నట్లు గుర్తించి, వాటిని స్వాధీనం చేసుకుని జరిమానాలు విధించారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ మాట్లాడుతూ నిషేధిత ప్లాస్టిక్‌పై ఎప్పటికప్పుడు అవగాహన కల్పిస్తున్నా.. పలువురు దుకాణదారుల్లో మార్పు రావడం లేదన్నారు. ఇలాంటి వారిపై కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు. శానిటరీ సిబ్బంది, సచివాలయ శానిటరీ సెక్రటరీ పాల్గొన్నారు.